సాక్షి
చిత్తూరు
సోమవారం ၊ 7 ၊ ఏప్రిల్ ၊ 2025



పట్టువస్త్రాల సమర్పణ..

చిత్తూరు పట్టణంలోని పోలీస్ క్వార్టర్‌లోని రామాలయంలో నవమి నందర్భంగా కలెక్టర్, ఎస్పీ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. - 8లో



గజరాజు గాయాలపై విచారణ

బంగారుపాళెం మండలంలో ఏనుగు గాయాలపై అనుమానితులను విచారణ చేస్తున్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. - 8లో



దారిదోపిడీ నిందితుల అరెస్టు

బంగారం దారిదోపిడీ ఘటనలో నిందితులను అరెస్టు చేసి, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

గడువు తీరిన గ్లౌజులు సరఫరా



చిత్తూరు రూరల్(కాణిపాకం) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి గడువు తీరిన గ్లౌజులు సరఫరా అయ్యాయి. ఆస్పత్రికి అందించిన గ్లౌజులు 2020 జనవరిలో సరఫరా ప్రారంభించారు. దీనికి డిసెంబర్ 2024తో గడువు ముగిసింది. అయితే సెంట్రల్ డ్రగ్స్ నుంచి బల్క్‌గా ఆస్పత్రికి గ్లౌజ్‌లు సరఫరా అవ్వడంతో ఆస్పత్రి వర్గాలు విస్తుపోతున్నాయి. గడువు తీరిన వాటిని ఎలా వాడాలని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఫార్మసీ స్టోర్ అధికారులను వివరణ కోరగా గ్లౌజ్‌ల సరఫరా కొన్ని నెలలుగా లేదు..అందుకే డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం నుంచి తెప్పించామని, వీటిని వర్కర్లు, ఇతర అవసరాలకు వాడుతున్నామని పేర్కొన్నారు.

నేడు పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : నగరంలోని వన్‌టౌన్ పక్కన ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు.

సమాజానికి రచయితలే వైద్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామలక్ష్మి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సమాజానికే రచయితలే వైద్యులని కుప్పం రెడెమ్మ సాహితీ ట్రస్టు వ్యవస్థాపకులు రామలక్ష్మి తెలిపారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ట్రస్టు ఆధ్వర్యంలో సాహితీ పురస్కారాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మనిషి అనారోగ్యానికి వైద్యం చేసే వైద్యులు ఎలాగో సమాజానికి కూడా రచయితలు వైద్యులని తెలిపారు. సమాజంలో జరిగే ఘటనలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తేవడంలో రచయితల పాత్ర కీలకమన్నారు. భాషాభివృద్ధికి వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రచయిత బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలు పెంపొందించే దిశగా సాహితీ సృజన జరగాలన్నారు. ఈ దిశగా కవులు, రచయితలు రచనలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ రచనలు చేసిన కవులకు రామలక్ష్మి, ట్రస్టు సభ్యులు నిరంజన్‌రెడ్డి, రోజా పురస్కారాలు అందజేశారు.

ప్రకృతి సంపదను ఎడాపెడా అధికార పార్టీ నేతలు దోచేస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా టిప్పర్‌లతో ఇసుక అక్రమ రవాణా చేసి సరిహద్దులు దాటించి రూ.లక్షలు దోచేస్తున్నారు. ప్రజాధనానికి కాపాల ఉండాల్సిన ప్రజాప్రతినిధులే పోటీపడి ఇసుకను కొల్లగొట్టి జేబులు నింపుకుంటున్నారు. అడ్డుజెప్పాల్సిన అధికారులే ఇసుక అక్రమ రవాణాకు పచ్చజెండా ఊపుతున్నారు. ఈ అక్రమ రవాణాపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకొనే వారే కరువయ్యారు.



పలమనేరులోని క్యాటిల్‌ఫామ్ బ్రిడ్జి వద్ద కౌండిన్య నదిలో ఇసుక తోడేస్తున్న అక్రమార్కులు

ఆపే దమ్ముందా!

- ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ
- పగలు తవ్వడం.. రాత్రి రవాణా !
- చిత్తూరులో బీఎస్‌ఆర్‌పేట రీచ్ టీడీపీ నేతల అడ్డా..
- కుర్చివేడు ప్రాంతంలో టన్నుల కొద్దీ ఇసుక డంప్‌లు
- నగరిలోని కుశస్థలి నదిని తోడేస్తున్న ఇసుక తోడేళ్లు
- పూతలపట్టు, పలమనేరులో తమ్ముళ్ల బరితెగింపు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ, పోలీసు అధికారులు



నగరి మున్సిపాలిటీ తెరణి వద్ద కుశస్థలి నదిలో రెచ్చిపోతున్న ఇసుకాసురులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : చిత్తూరు జిల్లాలో అధికార పార్టీ నాయకులు ఎవరికి వారు పోటీపడి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఉచితం మాటున కూటమి నేతలు ఇసుకను యంత్రాలతో తవ్వుకుని రహస్య ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రి సమయాల్లో జిల్లా సరిహద్దు దాటించేస్తున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసులకు తెలిసినా నెలనెలా మామూళ్లు తీసుకొని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. చిత్తూరు రూరల్ మండల పరిధిలో బీఎస్‌ఆర్‌పేట రీచ్‌ను అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులు అడ్డాగా చేసుకుని అక్రమ వ్యాపారానికి తెరలేపారు. అనగల్లు రీచ్‌లోని ఇసుక క్వాలిటీ ఉండటంతో టీడీపీ నేతలు దొంగచాటుగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాలూరు, దిగువమాసాపల్లిలో గతంలో నిల్వ ఉంచిన ఇసుకను రాత్రీ పగలు తోడేస్తున్నారు. బీఎస్‌ఆర్‌పేట రీచ్‌లో పగలంతా ఇసుక తవ్వకాలు చేస్తుంటారు. అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా కుర్చివేడు ప్రాంతంలోని డంప్‌లకు చేరవేస్తున్నారు. అలా అయిదు పోట్ల టన్నుల కొద్దీ ఇసుకను డంప్ చేస్తున్నారు. ప్రతి రోజూ 100 నుంచి 150 లోడ్ల వరకు డంప్ అవుతున్నాయి. డంప్ అయినా ఇసుకను చీకటి పడితే టిప్పర్ల ద్వారా తమిళనాడుకు తరలిస్తున్నారు. గుడిపాలలోని వెంగమాంబపురం, రామాపురం మీదుగా తమిళనాడు సరిహద్దు దాటుతోంది. అలాగే శెట్టిన్ తంగాల్ మీదుగా తమిళనాడు సరిహద్దులోకి చొరబడుతోంది. ఇలా తరలించిన ఇసుకను టిప్పర్ రూ.60 వేల నుంచి రూ. లక్ష వరకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

వీళ్లే కీలకం...?

చిత్తూరులో అక్రమ వ్యాపారంలో స్థానిక ఎమ్మెల్యే అనుచరులు, దగ్గర బంధువు పాత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. నారగల్లుకు చెందిన మరో టీడీపీకి చెందిన వ్యక్తి తమిళనాడులో ఇసుకకు గిరాకీలు తీసుకొస్తుంటారు. మరో ఇద్దరు బీట్ వేసి గేట్లు తీస్తున్నారు. అక్కడి నుంచి బండి వెనుక ఒకరు...ముందు మరొకరు వెళ్లి సరిహద్దులు దాటిస్తున్నారు. ఇలా రాత్రుల్లో రయ్..రయ్‌మంటూ భారీగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రాత్రింభవళ్లు ఇంత పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వంలో గగ్గోలు పెట్టిన నేతలు ఇప్పుడు ఇంత పెద్ద స్థాయిలో ఇసుక దోపిడీ జరుగుతుంటే స్పందించకపోవడం దారుణం.



చిత్తూరు: బీఎస్‌ఆర్ పేటలో అక్రమార్కులు నిల్వచేసిన ఇసుక దంపు

ప్రేక్షక పాత్రలో అధికారులు

విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు. పోలీస్ స్టేషన్ ముందరే ఇసుక ట్రాక్టర్లు పరుగులు పెడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఒక విధంగా సహజ సంపద దోపిడీకి కాపాలా కాస్తున్నారు. అధికార పార్టీ నేతలు ఇసుకను ఎలా కొల్లకొడుతున్నారో అధికారులు, పోలీసులు వారికి ఎలా వత్తాసు పలుకుతున్నారో అర్థం కావడం లేదు. దీనిపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికార పార్టీకి అధికారులు అమ్ముడుబోయి...అక్రమ రవాణాకు వంత పాడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జీడీనెల్లూరు: నీవా నదిలో పచ్చ నేతలు నిల్వచేసిన ఇసుక దంపు

ఇసుక అక్రమ రవాణా ఇలా..

- పూతలపట్టు మండలం వావిల్‌తోట, తవణంపల్లి మండల పరిధిలోని మైనగుండ్లపల్లి సమీపంలోని బహుదానదిలోని ఇసుకను జేసీబీలతో తవ్వుకుని టిప్పర్ల ద్వారా కర్ణాటక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.
- నగరి మున్సిపాలిటీ తెరణి గ్రామం వద్ద కుశస్థలి నది నుంచి ప్రతి రోజూ వందల ట్రాక్టర్లు ఇసుక ఉచితం పేరుతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నదిలో నీరున్నా లెక్క చెయ్యడం లేదు. కొన్ని సందర్భాల్లో రాత్రి పూట లైట్లు వేసుకొని ఇసుకను తోడి అక్రమంగా తరలిస్తున్నారు.
- విజయపురం మండలంలో కేవీ శ్రీ రామపురం వద్ద కుశస్థలి నది నుంచి ప్రతి రోజూ సుమారు 150 ట్రిప్పుల ఇసుకను టీడీపీ నేతలు తరలిస్తున్నారు. టీడీపీ శ్రేణులు కాకుండా మరెవరైనా భవన నిర్మాణాల కోసం ఇసుకను ట్రాక్టర్‌లలో తీసుకెళితే.. పోలీసులకు చెప్పి కేసులు పెట్టిస్తున్నారు
- పలమనేరు మండలంలోని కౌండిన్య నదిలో కేటిల్ఫాం నుంచి వైఎస్సార్ జలాశయం దాకా దాదాపు 10 గ్రామాల్లో నిత్యం ఇసుకను ట్రాక్టర్లలో రవాణా చేసి డంపుల్లో నిల్వ ఉంచుకుంటున్నారు.
- గంగవరం మండలంలోని జీడిమాకనపల్లి వద్ద దాదాపు 20 మంది ఇసుక స్మగ్లర్లు 30 ట్రాక్టర్లు 10 జేసీబీలతో నిత్యం ఇసుకను తోడుతూనే ఉన్నారు. ఇదే మండలంలో మరో నాలుగు గ్రామాల వద్ద ఇసుక అక్రమ రవాణా నిత్యం జరుగుతూనే ఉంది.
- పెద్ద పంజాణి మండలంలోని కౌండిన్య నదికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో నిత్యం ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది.
- బైరెడ్డిపల్లి మండలంలోని పెద్ద చెరువులో నిత్యం ఇసుక మట్టి అక్రమ రవాణా సాగుతోంది.
- వీకోట మండలంలోని పలు చెరువుల్లో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది, వీరంతా తాము చంద్రబాబు చెప్పారని కాబట్టే ఇసుక తోలుకుంటున్నామని అధికారులు, పోలీసులను సైతం బెదిరిస్తున్నారు.
- కుప్పం నియోజక వర్గ పరిధిలో టీడీపీ నేతలు మట్టి నుంచి ఇసుకను వేరుచేసి (కృత్రిమ ఇసుక) అమ్మి సొమ్ములు చేసుకుంటున్నారు.

అనారోగ్య నగరి

నగరి చుట్టూ కొండలు.. ఏపుగా పెరిగిన చెట్లు, జల జల పారే నది ఎటూ చూసిన ప్రకృతి పరవశింపజేసేలా రమణీయంగా ఉండేది.. అలాంటి నగరి చుట్టూ నేడు కాలుష్యం ఆవహించింది. కొండలు, చెట్లు అక్రమార్కుల దెబ్బకు నేలమట్టం అయ్యాయి. డైయింగ్ యూనిట్‌లు, ఇతర పరిశ్రమలు నదీ జలాలను కలుషితం చేస్తూ మనుషులను బతికున్న నిర్జీవులుగా మారుస్తున్నాయి. వీటి కాలుష్యం కారణంగా జనం ఏటా వివిధ రోగాల బారీన పడి నిండు జీవితాలు నాశనం అవుతున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.

కాలుష్యమస్తు

- నగరిని కమ్మేస్తున్న కాలుష్యభూతం
- తాగేనీరు, పీల్చే గాలి కలుషితం
- ఏటా పెరుగుతున్న అనారోగ్య బాధితులు
- పర్యవేక్షణను గాలికొదిలేసిన అధికారులు
- ప్రజల ఆరోగ్య రక్షణను పట్టించుకోని ప్రభుత్వం



పంట కాలువల్లో రసాయన నీరు, (ఇన్‌సెట్) కుశస్థలి నదిలో రసాయన నీరు (ఫైల్)

వ్యాధి బారిన పడిన బాధితుల వివరాలు				
వ్యాధి	2005-10	2011-15	2016-2020	2021-2025
ఆస్తమా	4082	4332	8716	7251
టీబీ	7598	9397	14852	14009
చర్మవ్యాధులు	9794	12808	15851	16349
దయాబిటీస్	19530	26238	30558	29519



కాల్చేందుకు సిద్ధంగా ఉంచిన టైర్లు

నగరి : నాలుగు వైపులా కొండలు ఉండటంతో నగరి కాలుష్య కోరల్లో చిక్కుంది. ఒకవైపు డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే హానికర రసాయనాలు తాగేనీటిని కలుషితం చేస్తున్నాయి. మరోవైపు టైర్లు కాల్చడం ద్వారా వెలువడే విష వాయువులు, కొండలు పిండి చేసే క్రషర్ల నుంచి వచ్చే దుమ్ము, దూళి గాలిని కలుషితం చేస్తున్నాయి. దీంతో ఏటా అనార్యోగం బారీన పడేవారి సంఖ్య పెరుగుతోంది. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా భవిష్యత్తు తరాలను అనారోగ్యం ముంచెత్తుతోంది. నగరి మున్సిపల్, రూరల్ మండలం, నింద్ర, విజయపురం మండలాల్లో సుమారు 1.37 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరందరికీ నీటి ఆధారం ఈ ప్రాంతాల్లోని కుశస్థలి నది, చెరువులు, గుంటలు, బావులు, బోర్లే. వీటన్నింటినీ తమిళనాడు సరిహద్దు నుంచి వరుసగా ఏర్పాటు చేసిన డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే హానికర రసాయనాలు కలుషితం చేస్తున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు కలుషితం అవుతూ బోర్లు వేసినా తాగడానికి ఉపయోగపడే నీరు లభ్యం కావడం లేదు.

పక్కన నిషేధం.. ఇక్కడ ఆమోదం

నగరిలో గతంలో నేత వ్యాపారం అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సమయంలోనే నగరిలో 70 మాన్యువల్ డైయింగ్ యూనిట్లే ఉన్నాయి. నేడు నేత పరిశ్రమ వారికి అంతర్జాతీయ వ్యాపార సంబంధాలు అంతంత మాత్రమే, నేత కార్మికులకు పనులు అంతంత మాత్రమే. అయితే 70 మాన్యువల్ డైయింగ్ యూనిట్లకు సమానమైన మెషిన్ డైయింగ్ యూనిట్లు 18 ఉన్నాయి. వీటి నుంచి ప్రతి రోజు లక్షల లీటర్ల హానికర రసాయన నీరు జనవాసాలపైకి వస్తోంది. తమిళనాడులో నిషేధించిన డైయింగ్ యూనిట్లు స్థానిక ముసుగులో నగరిలో వేళ్లూనుకున్నాయి. పక్క రాష్ట్రంలో నిషేధించిన యూనిట్లకు మన రాష్ట్రంలో ఆమోదించడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాల్చే టైర్లతో గాలి విషపూరితం

మండలంలోని నాగరాజకుప్పం వెళ్లే మార్గంలో జగనన్న కాలనీకి సమీపంలో టైర్లు కాల్చే ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యం గాలిని కలుషితం చేస్తోంది. టైర్లు తగలబెట్టడం వల్ల గాలిలోకి గణనీయమైన మొత్తంలో విషపూరిత కాలుష్య కారకాలైన సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ కలుస్తోంది. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ స్టాండర్డ్ ఫర్ ఎయిర్ క్వాలిటీ యాక్ట్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బహిరంగ ప్రదేశాల్లో టైర్లను కాల్చడాన్ని నిషేధించినా ఇవి ఎలా కొనసాగుతున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

క్రషర్ల నుంచి వెలువడే దుమ్ము దూళి

నగరి చుట్టూ ఉన్న కొండలు క్రషర్ల దాటికి కరిగిపోతున్నాయి. ఈ ప్రాంతంలో 20 క్రషర్లు అడ్డు అదుపూ లేకుండా కొండను పిండి చేస్తుండటంతో వెలువడే దుమ్ము దూళి సుదూర ప్రాంతం వరకు గాలిలో కలుస్తోంది. గాలిని కాలుష్యం చేస్తోంది. వీటి ప్రభావం ప్రజలపై పడుతోంది.

ఏటా పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు

అన్ని వైపులా తాగునీరు, గాలి కలుషితం కావడంతో అనారోగ్యానికి నగరి పుట్టినిల్లుగా మారిపోయింది. వైద్యులు అందించిన గణాంకాల మేరకు నగరిలో 2005వ సంవత్సరంలో 615 మంది ఆస్తమా, 1412 మంది టీబీ, 1935 మంది చర్మ వ్యాధులు, 3102 మంది దయాబెటీస్‌తో బాధపడేవారు. నేడు 1978 మంది ఆస్తమా, 3,242 మంది టీబీ, 4123 మంది చర్మవ్యాధులు, 7,868 మంది దయాబెటీస్‌తో బాధపడుతుండగా నగరిలో దయాలసిస్ సెంటర్ ప్రారంభించిన ఒకటిన్నర ఏడాదికే 59 మంది కిడ్నీ బాధితులు చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందేవారితో కలుపుకుంటే వీరి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది.

నిబంధనలకు పాతర

నగరిలోని మిషన్ డైయింగ్ యూనిట్లు నిబంధనలే పాటించడం లేదని, ఈటీపీ లేదని మున్సిపల్ అధికారులు పరిశీలించి స్పష్టం చేస్తుంటే వాటిని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు దశాబ్ద కాలంగా ఎలా కొనసాగించింది అనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. తాగడానికి ఉపయోగపడని నీరు సాగుకు కూడా ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. పంట పొలాలకు నీరు పారాల్సిన కాలువల్లో రసాయన నీరే పారుతోంది. చెరువుల్లో పట్టే చేపల రూపంలో ఆహారం కూడా కలుషితంగా మారుతోంది. ప్రజలకు హాని కలిగించే ఈ యూనిట్లు ప్రజల సంచారం లేని ప్రాంతాల్లో పర్యావరణానికి హాని కలిగించని రీతిలో పెట్టుకోవాలని ప్రజలు పోరాడే పరిస్థితి ఎదురైంది.

దయాలసిస్ చేసుకుంటున్నా



కొన్నేళ్లుగా దయాలసిస్ చేసుకుంటున్నా. నాలా ఇంకొందరు బాధ పడకూడదంటే కాలుష్యాన్ని నివారించాలి. నీటి వనరుల్లో రసాయన నీరు వదలడం ఆపాలి. ఇప్పుడు చేయగలిగితే మరో 20 ఏళ్లకు నీరు బాగుపడే ఆస్కారం ఉంటుంది. **- టి. బాలకృష్ణ, నత్తం కండ్రిగ**

పర్యావరణ పరిరక్షణకు పోరాడుతున్నాం



హానికర రసాయన రంగునీటి కారణంగా ఇప్పటికే జల వనరులన్నీ కలుషితమయ్యాయి. అనారోగ్య బాధితులు పెరిగిపోతున్నారు. అందుకే పర్యావరణ పరిరక్షణకు పోరాడడానికి సిద్ధమయ్యాం. తమిళనాడులో నిషేధించిన యూనిట్లకు మన రాష్ట్రంలో అనుమతులు ఎలా ఇస్తారు. ఇక్కడి వారు కూడా ప్రజలే కదా. అఖిల పక్షనేతలతో కలిసి కలుషిత రసాయన రంగు నీటి వ్యతిరేక ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసి పోరాడుతున్నాం. **- గజేంద్ర, అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు**

డైయింగ్ యూనిట్లపై చర్యలు తీసుకుంటున్నాం



అన్ని డైయింగ్ యూనిట్లు పరిశీలించి నిబంధనలు పాటించడం లేదని గుర్తించడంతో ఆపేయాలని సూచించాం. వాటిలో 8 యూనిట్లకు తాళం వేశాం. ఏ యూనిట్ పనిచేసి నీరు బయటకు వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. ఉన్నతాధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం. **- కృష్ణారెడ్డి, కమిషనర్, నగరి మున్సిపాలిటీ**

కమనీయం.. కల్యాణోత్సవం



స్వామి కల్యాణంలో ఆలయ అర్చకులు

కాణిపాకం : శ్రీరామ నవమిని పురస్కరించుకుని కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సీతా రాముల కల్యాణోత్సవాన్ని నేత్రానందంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించారు. కల్యాణ వేదికపై ఆశీనులు చేసి పండితులు వేద మంత్రాలు పఠిస్తూ కల్యాణోత్సవ వేడుకను పూర్తి చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ పెంచల కిషోర్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.



కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు

సారా స్వాధీనం.. కేసు నమోదు



బట్టీ వద్ద సారాను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

పాలసముద్రం : నాటుసారా తయారు చేస్తున్న పెరియార్ స్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. ఆదివారం మండలంలోని నరసింహపురం గ్రామం భూతలకోన వద్ద నాటుసారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ చిన్నరెడ్డప్ప దాడులు చేయగా పెరియార్‌స్వామి పరారయ్యాడు. సారా బట్టీని కూల్చివేసి సుమారు 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన పెరియార్ స్వామిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కరెంటు తీగల చోరీ



విద్యుత్ తీగలు చోరీ అయిన ప్రాంతాన్ని చూపిస్తున్న రైతు

గంగాధర నెల్లూరు : సుమారు రూ.25 వేల విలువ గల విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు జీడి నెల్లూరు రైతు రామచంద్రయ్య తెలిపారు. గంగాధర్ నెల్లూరు మండల కేంద్రంలోని వ్యవసాయ భూమికి సంబంధించిన ఓ షెడ్డు నిర్మాణ పనుల కోసం 150 మీటర్ల విద్యుత్ తీగలు తన షెడ్డు వద్ద ఉంచగా ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. తనను ఆదుకోవాలని రైతు రామచంద్రయ్య డిమాండ్ చేశారు.

ఆటోను ఢీకొట్టిన కారు

– ఐదుగురికి గాయాలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని కట్ట మంచి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయిదుగురికి గాయాలయ్యాయి. చిత్తూరు నుంచి మురకంబట్టు వైపునకు ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతుండగా .. ఎదురుగా చిత్తూరు వైపు వస్తున్న కారు, ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అయిదుగురికి గాయాలయ్యాయి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘పల్లెపండుగ’కు పైసల్లేవ్!

- పనులు చేసి మూడు నెలలవుతున్నా అందని బిల్లులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు
- వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆందోళన
- ఖర్చు రూ.87 కోట్లు, జమ రూ.26 కోట్లే..

చిత్తూరు కార్పొరేషన్ : ‘పల్లె పండుగ’ పేరుతో గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు నిర్మించి ఎంతో కొంత వెనకేసుకోవచ్చని కూటమి నేతలు భావించారు. పనులు చేసి రెండు నెలలు పూర్తవుతున్నా అధిక మొత్తంలో బిల్లులు మంజూరు కాలేదు. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక లబోదిబోమంటున్నారు. ఆదాయం వస్తుందని ఆశపడి వడ్డీలకు తెచ్చి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

ఆదాయ మార్గాలపై దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పెద్దలు తమ కార్యకర్తలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఇసుక, మట్టి తరలిస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరించాలని అధికారులకు మౌఖికంగా ఆదేశించారు. అంతటితో ఆగకుండా పల్లెపండుగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి సీసీ రహదారులు, కాంపౌండ్ వాల్స్ పనులను అప్పగించారు. ఇందులో ఎక్కువ భాగం కూటమి నేతలు చెప్పిన ప్రాంతాల్లో వేసి వీటి ద్వారా వారికి మేలు చేయాలని భావించారు.

అప్పులు చేసి..

పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూ



గుడిపాలలో వేసిన సీసీ రోడ్డు

ర్చడంలో టీడీపీది విభిన్న శైలి. అధికారంలో ఉన్నన్నాళ్లు తమ వారికి అన్ని రకాలుగా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇందులో భాగంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పనులు వారికే అప్పజెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో పార్టీ వారికే సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు అప్పగించారు. ప్రభుత్వం తమదే కాబట్టి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు వస్తాయని అప్పులు తెచ్చి కూటమి నేతలు పనులు పూర్తి చేశారు. అయితే పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంపై తమ్ముళ్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 61 కోట్ల నిధులు..

జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పనులను మొత్తం 1716 పనులు కేటాయించగా అందులో 1387 పూర్తి చేశారు. పూర్తి చేసిన పనుల విలువ రూ.87 కోట్లు ఖర్చు అయింది. వీటిలో రూ.26 కోట్లు మాత్రమే ఖాతాల నందు జమ అవ్వగా ఇంకా రూ.61 కోట్ల నిధులు రావాల్సి ఉంది. ఇందులో మొత్తం 240 కిలోమీటర్లు రోడ్డు నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం 162 కిలోమీటర్లు నిర్మాణానికి రూ.63 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మొదట్లో పనులు ప్రారంభించి చేసిన ప్రతి వారం నుంచి బిల్లులు వస్తాయని పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో అప్పులు తెచ్చి పనులు చేశారు. కానీ ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నమ్ముకుని అప్పులు చేసి పనులు చేస్తే ఇలా చేయడం ఏంటని పనులు చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లు.. గొల్లు!

పనులు పూర్తి చేసిన వారికి అధిక మొత్తంలో ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. ఉపాధి హామీ పథకం కార్యాలయం చుట్టూ తిరగలేకపోతున్నామని కూటమి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో ఇంత ఆలస్యం చేస్తే భవిష్యత్తులో పనులు ఎలా చేయగలమని మరికొందరు బాహాటంగా ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల చెల్లింపుల్లో ఇంత ఆలస్యం చేయడం ఎంత వరకు సబబని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం

పల్లె పండుగ పేరుతో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రహదారులు అధిక భాగం పూర్తయ్యాయి. కొంత భాగం బిల్లులు వచ్చాయి. మిగిలిన మొత్తం బిల్లులను ఆన్‌లైన్ చేశాం. ఎక్కడైనా పనులు మిగిలి ఉంటే వాటిని పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. వాటిని త్వరలో పూర్తి చేసి పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఈ, పంచాయతీరాజ్

వేలూరు బస్టాండులో రగడ

- చిత్తూరు యువకుడిని ఆర్టీసీ బస్సులో ఎక్కించుకోని వైనం
- కండక్టర్, డ్రైవర్ దురుసు ప్రవర్తన
- అధికారులకు ఫిర్యాదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఆర్టీసీ అవసరానికి చిత్తూరు టిక్కెట్లు కనిపిస్తున్నాయి. తిరుపతి టిక్కెట్లు నిండితే.. చిత్తూరు టిక్కెట్లను ఛీ కొడుతోంది. జిల్లా కేంద్రం అనే విషయాన్ని మర్చిపోతోంది. వేలూరు బస్టాండులో చిత్తూరు వారికి ఆర్టీసీ నుంచి రోజూ అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. దీనిపై ఫిర్యాదులు వెలువెత్తుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. చిత్తూరు నగరానికి చెందిన ఓ యువకుడు శుక్రవారం రాత్రి 11.45 గంటల సమయంలో వేలూరు బస్టాండుకు చేరుకున్నాడు. ఆ సమయంలో వేలూరు–తిరుపతి సప్తగిరి ఎక్స్‌ప్రెస్ సర్వీసు మాత్రమే బస్టాండ్‌లో ఉంది. ఆ బస్సు ఎక్కేందుకు వెళ్లిన ఆ యువకుడిని కండక్టర్ ఎక్కడికెళ్లాలని అడిగారు. చిత్తూరని చెప్పడంతో బస్సు ఎక్కొద్దని సూటిగా చెప్పేశారు. దీంతో ఆ యువకుడు, కండక్టర్‌కు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మధ్యలో డ్రైవర్ కూడా కల్పించుకున్నాడు. ఎట్టి పరిస్థితుల్లో చిత్తూరు టిక్కెట్లు ఎక్కించేది లేదని..నీకు దిక్కున చోట చెప్పుకో అంటూ దురుసుగా ప్రవర్తించారు. దీంతో వాళ్ల పోరు పడలేక ఆ యువకుడు గంట పాటు వేచి ఉండి వేరే బస్సు ఎక్కాడు. శనివారం ఆర్టీసీ అధికారులకు శుక్రవారం రాత్రి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని తిరుపతి డీఎం దృష్టికి తీసుకెళతామని డీపీటీఓ జగదీష్ పేర్కొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణలో కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు పట్టణం నందు టాప్‌లైన్ , పి.జి.ఆర్. పోలీసు క్వార్టర్‌లోని సీతారామ ఆలయాల్లో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఏఆర్ పోలీసులు ఏర్పాటు చేసిన సీతారామ కల్యాణ మహోత్సవం భక్త జనుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ , ఎస్పీ మణికంత చందోలు కుటుంబ సమేతంగా సీతారాముల వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఏఎస్పీ శివానంద కిషోర్ దంపతులు కూడా స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ సుమారు



సీతారాముల కల్యాణోత్సవంలో కలెక్టర్, ఎస్పీ

500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణోత్సవంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ రాజశేఖర్ రాజు, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ఏఆర్. డీఎస్పీ మహబూబ్ బాష పాల్గొన్నారు.

గజరాజు గాయాలపై విచారణ

- ఏనుగు మృతి అవాస్తవం
- 4 నాటుబాంబులు స్వాధీనం

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో నాలుగు రోజులుగా పలు మాధ్యమాల ద్వారా ఏనుగు మృతి పై వస్తున్న సమాచారం అసత్యమని డీఎఫ్ఓ భరణి స్పష్టం చేశారు. ఆదివారం వెస్ట్ రేంజ్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బంగారుపాళెం మండలం బోడబండ్ల పంచాయతీ జమ్ముమేరేడుపల్లి వద్ద నాలుగు రోజుల కిందట ప్రమాదం జరిగిందన్నారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు జరిగిన నాటుబాంబు పేలుడులో కుక్క చనిపోయిందన్నారు. మరో నాటుబాంబు పేలినప్పుడు ఓ ఏనుగు కాలికి స్వల్ప గాయమైనట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సమాచారం తెలిసిన వెంటనే బోడబండ్ల, రాచేరు, రాగిమానుపెంట బీట్‌లో సిబ్బంది ముమ్మర తనిఖీలు చేపట్టారన్నారు. పరిశీలనలో అక్కడక్కడ ఏనుగు పాదాల నుంచి కారిన రక్తపు చుక్కలను సేకరించి వాటిని ల్యాబ్‌కు పంపామన్నారు. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం ఓ ఏనుగు కాలి ఎముకతో కొంత గాయపడినట్లు తెలిసిందన్నారు. దర్యాప్తులో అడవి పందులు, ఇతర జంతువులను వేటాడటానికి ఈ ప్రాంతానికి చెందిన కొందరు ఆరు నాటు బాంబులు అమర్చినట్లు గుర్తించామన్నారు. ఇందులో రెండు పేలగా మరో నాలుగు నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ ఘటనపై 11 మంది అనుమానితులను గుర్తించి విచారిస్తున్నామన్నారు.



స్వాధీనం చేసుకున్న నాటు బాంబులు

సోలార్ కంచెకు నివేదిక

యాదమరి, బంగారుపాళ్యం ప్రాంతాల్లో తరచూ ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాలను గుర్తించామన్నారు. ఇక్కడి నుంచి గ్రామాలపైకి రాకుండా ఆరు కిలో మీటర్ల మేర సోలార్ కంచె వేయడానికి ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. ఏడాది కాలంలో ఏనుగుల ద్వారా జరిగిన పంట నష్టం రూ.1.20 కోట్లగా అంచనా వేశామన్నారు. ఆ మొత్తాలను రైతులకు దశల వారీగా అందజేస్తున్నామన్నారు. సమావేశంలో శిక్షణ డీఎఫ్ఓ సంకేత్ సునీల్, డీఆర్వో ఆనంద్‌రెడ్డి, ఎఫ్ఎస్ఓ మోహన మురళి పాల్గొన్నారు.

రంకెలేసిన ఉత్సాహం



కోడెగిత్తను నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

ఐరాల : మండలంలోని మొరవగుట్టపల్లెలో ఆదివారం కోలాహలంగా ఎద్దుల పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి ఎద్దులను తీసుకొచ్చారు. గోవులను, ఎద్దులను శుభ్రం చేయించి, కొమ్ములకు రంగులు వేశారు. పూల మాలలు, రంగు కాగితాలు, కొమ్ములకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్‌లు కట్టి పందేలకు సిద్ధం చేశారు. అంతకు ముందే వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న యువత అల్లి వద్ద పలకల కోసం నిలబడ్డారు. అనంతరం ముస్తాబు చేసిన కోడె గిత్తలను, ఎద్దులను జన సమూహం వైపు వదిలిపెట్టారు. అవి రంకెలేసుకుంటూ జనాలపై దూసుకుపోయాయి. గిత్తలను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీ పడ్డారు. పలకలను దక్కించుకున్న యువత విజయోత్సాహంతో సంబరాలు చేసుకున్నారు.

కార్మికుల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కార్పొరేషన్ : ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) విస్తరణను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉప కార్మిక కమిషనర్ ఓంకార్‌రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. పేర్ల నమోదుకు ఈనెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ ప్రత్యేక నమోదు శిబిరాలను తిరుపతి, చిత్తూ రు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో లేదా మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు, తిరుపతి జిల్లా 9492 555230, చిత్తూరు జిల్లా 9492555223, 949255 5216 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి





మదన్‌మోహన్ (ఫైల్), సంఘటనా స్థలంలో మృతదేహం

సదుం : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు..ఊటుపల్లెకు చెందిన మదన్‌మోహన్ (54) ఎలక్ట్రికల్ కాంట్రాక్టు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పాలమంద సబ్‌స్టేషన్ సమీపంలో కట్టెలతో వెళ్తున్న లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో కేబుళ్లు తెగి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆ సమయంలో అక్కడే ఉన్న మదన్ మోహన్ సరఫరా ట్రిప్ కావడంతో తెగిన కేబుళ్లు రోడ్డుపై నుంచి తొలగించే ప్రయత్నం చేశాడు. ఓ ప్రైవేటు సెల్ కంపెనీ టవర్‌కు విద్యుత్ సరఫరా చేసే కేబుళ్లపై.. తొలగిస్తున్న 33 కేవీ కేబుల్ పడటంతో దానిని పట్టుకోగానే అతడు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు రవిశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పీలేరుకు తరలించారు.

ఏఈ, లైన్‌మెన్ తాత్కాలిక సస్పెన్షన్

కార్వేటినగరం : కార్వేటినగరం ఇన్‌చార్జి ఏఈ, లైన్‌మెన్‌లను తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ ఇస్మాయిల్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వేటినగరంలో ఇన్‌చార్జి ఏఈగా విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తి, అన్నూరు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బాబు లైన్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టా భూమిలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలి, కానీ చెట్లను పూర్తిగా అడుగు భాగంతో తొలగించడంతో గ్రామస్తులు ఆధారాలతో పాటు రాత పూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ దీనిపై చర్యలు చేపట్టాలని ఆదేశించారన్నారు. దీంతో వారిని తాత్కాలికంగా విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి వీడ్కోలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తిరుగుప్రయాణమయ్యారు. పలువురు న్యాయమూర్తులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శ్రీనివాస శివరామ్, డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి ఈ. భీమారావు, తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, జ్యుడీషియల్ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ ధనుంజయనాయుడు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,496 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 30,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.60 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందు వచ్చిన వారిని క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

దొరికితే దొంగలు!

- చెన్నై–కర్ణాటక మార్గంలో అక్రమ బంగారం రవాణా
- బిల్లులు లేకుండా భారీగా పసిడి తరలింపు
- ప్రభుత్వ ఖజానాకు పన్ను ఎగవేత
- నిద్దురోతున్న నిఘా అధికారులు

చిత్తూరు అర్బన్ : అటు తమిళనాడు.. ఇటు కర్ణాటక. మధ్యలో చిత్తూరు జిల్లా. తమిళనాడు నుంచి కర్ణాటకలోకి అడుగుపెట్టాలంటే చాలా వరకు చిత్తూరు మీదుగా వెళ్లాల్సిందే. అయితే ఈ దారి బిల్లులు లేకుండా జరుగుతున్న బంగారం విక్రయాలకు రాచమార్గంగా మారింది. దొరికితే దొంగలు.. దొరక్కుంటే దొరలు అన్నట్లు తయారయ్యింది. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి అక్రమ మార్గంలో కొందరు బంగారాన్ని దర్జాగా తీసుకెళుతున్నారు.

జీఎస్టీ నుంచి తప్పించుకుని..

బంగారు ఆభరణాల కొనుగోలు విషయంలో రెండు మార్గాలున్నాయి. మొదటిది ప్రతి కొనుగోలుపై క్యాష్ బిల్లు (ఇన్‌వాయిస్) ఇవ్వాలి. బంగారం విలువపై 3 శాతం జీఎస్టీని అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. మాకు అసలు బిల్లే వద్దు.. ఆ మూడు శాతం తగ్గించుకోండి, అంటూ చాలా మంది ఇన్‌వాయిస్ బిల్లు తీసుకోరు. రూ.లక్ష వరకు బంగారం కొన్నవాళ్లకు బిల్లు వద్దంటే రూ.3 వేలు తగ్గుతుంది. రోజుకు మూడు కిలోలు కొంటే..? రూ.కోట్లలో బంగారం చేతులు మారితే..? చిత్తూరుకు సరిహద్దులో ఉంటున్న వ్యాపారులకు సైతం ఇదే ప్రశ్నలు తలెత్తాయి. కిలో బంగారం రూ.కోటి



కేజీఎఫ్ నిందితుల నుంచి సీజ్ చేసిన బంగారు బిస్కెట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

చేరువలో ఉంది. రోజుకు కేజీ బంగారాన్ని తెచ్చుకున్నా.., రూ.3 లక్షల వరకు మిగులుతుంది. జీఎస్టీ నుంచి తప్పించుకోవడానికి చిత్తూరు మీదుగా బిల్లులు లేకుండా బంగారం రవాణా దర్జాగా సాగుతోంది.

కమీషన్ల కోసం..

దక్షిణాది బులియన్ మార్కెట్‌కు కేంద్రంగా ఉన్న చెన్నైలో రోజుకు టన్నుల కొద్దీ బంగారం విక్రయాలు జరుగుతాయి. కొనుగోలుకు సంబంధించి ఇన్‌వాయిస్ బిల్లులు లేకుండా బంగారం తీసుకోవడానికి చెన్నైలోకి బడా వ్యాపారులతో చాలా మందికి పరిచయాలు ఉన్నాయి. బిల్లులు లేకుండా చిత్తూరు మీదుగా రోజుకు కిలోల కొద్దీ బంగారు బిస్కెట్లు, వెండి ముద్దలు సరిహద్దులు దాటుతోంది. ఈ వ్యవహారంలో పైకి కర్ణాటక వాసులు కనిపిస్తున్నా.. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లాలోని కొందరు బంగారు వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని, చెన్నై నుంచి బంగారాన్ని దుకాణాలకు చేరవేస్తున్నారు. పెట్టుబడి దుకాణాల యజమానులదైతే.. సరుకు తెచ్చి ఇచ్చే వ్యక్తికి 1.5 – 2 శాతం మధ్య కమీషన్లు తీసుకుని పని చేసే వ్యక్తులు చాలా మంది పనిచేస్తున్నారు.

సరైన నిఘా లేకపోవడం..

బిల్లులు లేకుండా బంగారం తీసుకెళుతున్న వ్యాపారులు, మధ్యవర్తుల వివరాలు తెలుసుకుంటున్న ముఠాలు దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. దోచుకున్న బంగారానికి బిల్లులు ఉండకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకురారనే ధీమాతో నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసులు నిత్యం తనిఖీలు పెంచడం, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సైతం నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకుని అక్రమార్కుల పనిపడితే తప్ప.. ఖజానాకు జమకావాల్సిన పన్నులు వసూలు చేయలేరు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

బిల్లులు లేకుండా బంగారం తీసుకెళుతున్నట్లు సమాచారం వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. బంగారం ఏ దుకాణంలో కొన్నారు..? డబ్బులు ఎలా తీసుకెళ్లారు..? అనే విషయాలపై ఆరా తీస్తాం. తప్పుడు మార్గాల్లో బంగారం తీసుకెళితే క్రిమినల్ కేసు నమోదు చేయడానికి వెనుకాడం.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

దారి దోపిడీ నిందితుల అరెస్ట్

– రూ.3.20 కోట్ల బంగారం స్వాధీనం

చిత్తూరు అర్బన్ : మూడున్నర కిలోల బంగారాన్ని దారి దోపిడీ చేసిన ఘటనలో ప్రధాన నిందితుడు కేజీఎఫ్‌కు చెందిన జయపాల్‌తో పాటు మరో నలుగురిని అరెస్టు చేసిన చిత్తూరు పోలీసులు.. దోచుకున్న మొత్తం బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జయపాల్ కేజీఎఫ్‌లో కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్న వ్యక్తి. గతంలో ఓ సారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడు. కేజీఎఫ్‌కు చెందిన మోహన్‌లాల్ స్థానికంగా బంగారు ఆభరణాల దుకాణం నిర్వహిస్తుండగా.. అతని అల్లుడు దిలీప్‌కుమార్ వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. చెన్నై నుంచి బంగారం కేజీఎఫ్‌కు తీసుకొచ్చే సమయంలో ముక్రమ్‌ను డ్రైవర్‌గా ఎంచుకున్నాడు. కేజీఎఫ్ వద్ద కూరగాయల దుకాణం నడుపుతున్న జమీల్‌కు డ్రైవర్ ముక్రమ్ బంగారం విషయం చెప్పాడు. దాన్ని జయపాల్‌కు చేరవేయడంతో ఈ దోపిడీ జరిగినట్లు పోలీసులు తేల్చారు. దోచుకున్న బంగారాన్ని నిందితులు సినిమా ఫక్కీలో కేజీఎఫ్‌కు తీసుకెళ్లారు. సాంకేతిక ఆధారాలతో చిత్తూరు పోలీసులు కేసును ఛేదించారు. రూ.3.20 కోట్ల బంగారాన్ని రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, వి.కోట సీఐ సోమశేఖర్‌రెడ్డి, గంగవరం సీఐ మురళీమోహన్, చిత్తూరు సీసీఎస్ సీఐ ఉమామహేశ్వర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ భాస్కర్‌తో పాటు బైరెడ్డిపల్లె ఎస్ఐ పరశురాముడు బృందాన్ని ఎస్పీ మణికంఠ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

చెత్త తీయకపోవడంపై నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

చిత్తూరు అర్బన్: నగరంలోని సంతపేటలో మున్సిపల్ కార్మికులు సరిగా చెత్త తీయడం లేదంటూ మహిళలంతా ఆదివారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని సంతపేట లో మునిసిపల్ కార్మికులు పారిశుద్ధ్య పనులు సరిగా నిర్వహించడం లేదంటూ రాగిమాను వద్ద మహిళలంతా రోడ్డుపై బైఠాయించారు. దీంతో కొద్ది సేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు జోక్యం చేసుకుని మహిళలకు నచ్చచెప్పడంతో శాంతించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సంలో ఎస్పీ..తదితరులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని సాయుధ దళం కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏఆర్‌పోలీసు విభాగం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఎస్పీ మణికంఠ చందోలు, సతీమణి హర్షిత రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ప్రజలకు దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.